క్లుప్తంగా

తొమ్మిది పొట్టేళ్లు మృత్యువాత



కొత్తకోటరూరల్: అకస్మాత్తుగా తొమ్మిది గొర్రె పొట్టేళ్లు మృత్యువాత పడిన సంఘటన మంగళవారం మండలంలోని సంకిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, గొర్రెల కాపారి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దేశిగట్టయ్య రోజువారీగా తన గొర్రెలను మేత కోసం గ్రామ సమీపంలోని గుట్టమీదకు సోమవారం తీసుకెళ్లాడు. గొర్రెలు గుట్టపైన ఆకులు, పచ్చిగడ్డి తిన్నాయి. మేత తిన్న జీవాల్లో మంగళవారం ఉదయం పొట్టేళ్లు ఒక దాని తర్వాత ఒకటి కిందపడి మృత్యువాత పడ్డాయి. రోగంతో చనిపోయాయా? లేక ఏదైనా విషపు ఆకులు తిని చనిపోయాయా? అనే విషయం అర్థం కావడంలేదని కాపారి పేర్కొన్నాడు. దాదాపుగా 9 పొట్టేళ్లు చనిపోవడంతో దాదాపు రూ.1.40 లక్షలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

హిందూ వాహిణి కార్యకర్తల అరెస్ట్



కొత్తకోట/వనపర్తి రూరల్: హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయాన్ని పునర్నిర్మాణం చేయాలని కొత్తకోట, పెబ్బేర్ మండల కేంద్రాల నుంచి చలో హైదరాబాద్‌కు వెళ్తున్న హిందూ వాహిణి కార్యకర్తలను అరెస్టు చేశారు. వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, హిందు వాహిని పట్టణ గౌరవ అధ్యక్షుడు ప్రహ్లాద్ ముదిరాజ్, కల్యాణ్, నరేష యాదవ్, మహేష్ యాదవ్, హరీష్ సింగ్, హరికృష్ణ, రాజు యాదవ్, చింతకాయల సురేష్, శ్రీకాంత్, శివ చారి, గిరిశ్వర్‌గౌడ్, ఫణిందర్, శివకుమార్ ఉన్నారు.

విద్యార్థులకు చెస్‌బోర్డుల పంపిణీ




మదనాపురం: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో మంగళవారం కొన్నూరు గ్రామస్తులు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలకు చెస్ బోర్డులు ఎంఈఓ ఫారూక్ హుస్సేన్ ద్వారా పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు పూర్వ విద్యార్థుల కమిటీలు ఏర్పాటు చేసి పాఠశాలల అభివృద్ధి కృషి చేయాలని ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఫోరం కోఆర్డినేటర్ జగదీశ్వర్ రెడ్డి, హెచ్ఎం నాగరాజు, సుదర్శన్‌రావు, ముహమ్మద్ ఇసాఖ్, లక్ష్మయ్య, ప్రేమలత, రవికుమార్ పాల్గొన్నారు.

మంద కృష్ణ సేవలకు గుర్తుగా జాంభవ భవనం



వనపర్తిటౌన్: పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సేవలకు గుర్తుగా హైదరాబాద్‌లో జాంభవ భవన నిర్మాణం చేపట్టబోతున్నట్లు ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఎంఈఎఫ్ సభ్యత్వ నమోదుతో పాటు, జాంభవ భవన నిర్మాణానికి ఇరు తెలుగు రాష్ట్రాల ఎంఈఎఫ్ ఉద్యోగుల నుంచి డొనేషన్లు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో డొనేషన్స్ సేకరించారు. మంద కృష్ణ మాదిగ సమాజానికి, సొంత వర్గానికి చేసిన సేవలకు ప్రతి ఉద్యోగి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోరెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి సిరీస్ కుమార్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కేశపాగ కేశవులు, గంధం భగవంతు పాల్గొన్నారు.

'యుద్ధం వద్దు.. శాంతి ముద్దు'



వనపర్తి రూరల్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎత్తం మహేష్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్‌తో కలిసి ఆయన ప్లకార్డులతో 'యుద్ధంవద్దు..శాంతి ముద్దు', 'అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి' అంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోపాల కృష్ణ, రమేష్, చందు, విష్ణు ఉన్నారు.

అదనపు క్లస్టర్లు ఏర్పాటయ్యేనా?

- రైతుల కష్టాలు తీరేనా?
- సిబ్బందికి పెరగనున్న పనిభారం
- క్లస్టర్ల పరిధిలోని గ్రామాలను మార్చాలి

పాన్‌గల్: రైతులకు వ్యవసాయ రంగంలో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వీలుగా గతంలో ప్రభుత్వం క్లస్టర్ల వ్యవస్థను ఏర్పాటు చేసినప్పటికీ, అదనపు క్లస్టర్ల విషయాన్ని పట్టించుకోవడంలేదు. విస్తీర్ణం, సాగవుతున్న భూమి, రెవెన్యూ లెక్కల ఆధారంగా 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి సహాయ వ్యవసాయ అధికారులను నియమించారు. సాగు విస్తీర్ణం పెరగడంతో అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న సహాయ వ్యవసాయ అధికారులపై పనిభారం పెరిగింది. కొత్త లెక్కల ప్రకారం క్లస్టర్లను పెంచాలని వ్యవసాయ అధికారులు నివేదికలు పంపినా, నేటికీ క్లస్టర్లు పెరగకపోవడంతో వ్యవసాయ శాఖలో ఏఈఓలు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రస్తుతం 49,942 వేల ఎకరాలలో పంటలు సాగువుతున్నాయి. వాటికి కేవలం 5 క్లస్టర్లు మాత్రమే ఉన్నాయి. వాటిలో పాన్‌గల్, రేమద్దుల, దొండాయిపల్లి, కేతేపల్లి, మల్లాయిపల్లి క్లస్టర్లు ఉన్నాయి. వాటి పరిధిలో దగ్గరగా ఉన్న గ్రామాలను వదిలి దూరంగా ఉన్న క్లస్టర్ల పరిధిలోకి చేర్చడంతో ఆయా గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదనంగా శాగాపూర్, తెల్లరాళ్లపల్లి, గోప్లాపూర్, బుసిరెడ్డిపల్లి 4 క్లస్టర్లు, వీపనగండ్ల మండలంలో తూంకుంట -2 క్లస్టర్లు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని భీమా, కేఎల్ఐ కాల్వల ద్వారా రెండు పంటలకు నీరు అందుతుండటంతో



పాన్‌గల్ రైతు వేదిక

మండలాల వారీగా వివరాలు..

మండలం	రైతులు	సాగు వివరాలు	క్లస్టర్ల సంఖ్య	ప్రతిపాదిత క్లస్టర్లు
పాన్‌గల్	19,917	49,942 ఎకరాలు	5	4
చిన్నంబావి	11,838	35,200 ,,	7	-
వీపనగండ్ల	12,500	34,100 ,,	6	1

సాగు పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

సంక్షేమ పథకాలతో పనిభారం..

క్లస్టర్ల వారీగా ఏఈఓలకు ఐదు వేల ఎకరాలు దాటి 8 నుంచి 10 వేల ఎకరాల వరకు పెరిగింది. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చేరవేయాల్సిన బాధ్యత క్లస్టర్ల అధికారులపై ఉంది. పంటసాగు నమోదు, రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు, గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పంటల సందర్శన చేసి సూచనలు, సలహాలు, రైతుబంధు, రైతుబీమా, సమగ్ర సర్వేలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏఈఓలకు ట్యాబ్ ల ద్వారా జీపీఎస్ ద్వారా కొత్త విధానం ప్రవేశపె ట్టారు. ఉదయం తమ పరిధిలోని రైతు వేదిక వద్దకు వెళ్లి సెల్ఫీ దిగి ట్యాబ్‌లో అప్‌లోడ్ చేయాలి. పంట ఉత్పత్తులు క్రయ విక్రయాల వివరాలు, దిగుబడి అంచనా వేయాలి.

క్లస్టర్ల పరిధిలో గ్రామాలు అస్తవ్యస్తం..

క్లస్టర్ల పరిధిలోని గ్రామాల ఎంపిక అస్తవ్యస్తంగా ఉంది. క్లస్టర్‌కు దగ్గరలో ఉన్న రైతు వేదికలో చేర్చకుండా పది నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న రైతువేదిక క్లస్టర్‌లో చేర్చడంతో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు సరియైన రవాణా సౌకర్యం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

మా జీపీని పాన్‌గల్ క్లస్టర్ పరిధిలోకి మార్చాలి



మా గ్రామ పంచాయతీని 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేమద్దుల క్లస్టర్ పరిధిలో ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ క్లస్టర్‌కు వెళ్లడం ఇబ్బందిగా మారింది. క్లస్టర్ పరిధిలోని రైతు వేదికకు వెళ్లాలంటే జిల్లా కేంద్రం వనపర్తికి వెళ్లి అటునుంచి రేమద్దులకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి దగ్గరలోని పాన్‌గల్ క్లస్టర్ పరిధిలోకి మార్చాలి.

– రాములు, మాజీ సర్పంచ్, అన్నారం

క్లస్టర్లను పెంచి ఇబ్బందులు తొలగించాలి



ఐదు వేల ఎకరాలకు, ఒక క్లస్టర్లకు ఒక ఏఈఓ ఉండాలి కానీ, ప్రస్తుతం మా పరిధిలో 9 వేల ఎకరాలు ఉండటంతో పనిభారం ఎక్కువ ఉంది. నా పరిధిలో ఆరు గ్రామాలు ఉండటంతో ఇబ్బందిగా ఉంది. రైతులకు సరియైన న్యాయం చేయలేక పోతున్నాం. మా క్లస్టర్ పరిధిలో 13 వేల ఎకరాల విస్తీర్ణం ఉంది. అదనపు క్లస్టర్ ఏర్పాటు చేస్తే కొంత పనిభారం తగ్గుతుంది.

– అఖిల, ఏఈఓ, పాన్‌గల్

నివేదికలు పంపాం



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో మండలంలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీనికి అనుగుణంగా అదనంగా క్లస్టర్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రస్తుతం ఉన్న ఐదు క్లస్టర్లకు అదనంగా మరో నాలుగు క్లస్టర్లు పెరిగితే ఏఈఓలకు పనిభారం తగ్గడంతో పాటు రైతులకు మేలు జరుగుతుంది.

– తిప్పేస్వామి, ఏడీఏ, పాన్‌గల్

వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



చెలిమిల్ల దగ్గర వంతెన పనులు పరిశీలిస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్

వనపర్తి రూరల్: రెండేళ్లుగా వాగుపై వంతెన నిర్మాణం పూర్తి కాక పోవడంతో, తాత్కాలిక రోడ్డు వర్షానికి గుంతలు, నెర్రెలు వచ్చి వాహనదారులకు నరకప్రాయంగా మారిందని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగేంధర్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం పెబ్బేరు మండలంలోని చెలిమిల్ల దగ్గర అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులు ఆగడానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారి మీదుగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారని, వాగు పొంగితే అవతలి గ్రామాలకు రాకపోకలు నిలిచి పోతాయన్నారు. ఇకనైనా మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మేగారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటన్నగౌడ్, అంజన్న, దేవరశివ, బత్తుల జితేందర్, రాఘవేందర్, రామన్ గౌడ్, రాజు, యశ్వంత్ ఉన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

మదనాపురం: ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం నెలవిడి, నరసింగాపురంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పనితీరుపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, కలిసికట్టుగా ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల అ ధ్యక్షుడు యాదగిరి, నాయకులు కోట్ల తిరుపత య్య, విండో వైస్ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ కో ఆ ప్షన్ సభ్యులు చాంద్‌పాషా, మండల యూత్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, విజయేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మాసన్నయాదవ్, పట్టణ అధ్యక్షుడు ఆవుల బాలు, కురుమూర్తి, చుక్క శివశంకర్, ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



వనపర్తి అంబేడ్కర్ చౌరస్తాలో మాట్లాడుతున్న నాయకులు

వనపర్తి రూరల్: దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్ సొంతమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి నరేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అరుణ పతాకాన్ని నరేష్ ఆవిష్కరించారు. విద్యార్థుల హక్కుల కోసం దేశ స్వాతంత్ర్యం కోసం నాడు పోరాటం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిందని, విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ. 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదన్నారు. విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, వంశీ, లక్ష్మీనారాయణ, మహేష్, చందు, విష్ణు, శివయాదవ్, చరణ్, నరేష్, సాయిచరణ్, బన్నీ, అశోక్, లోకేష్ పాల్గొన్నారు.

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేయాలి



మాట్లాడుతున్న మండ్ల రాజు

వనపర్తి రూరల్: జిల్లాలోని అన్ని గ్రామాల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేయాలని కార్మికులకు, కర్షకులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఎస్‌కేఎమ్ జిల్లా అధ్యక్షుడు డి బాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. భారతదేశంపై విధించిన 50 శాతం సుంకంపై అమెరికా ఆర్థిక నిషేధాన్ని ఎస్‌కేఎమ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటి వరకు జరిగిన స్వేచ్ఛ వాణిజ్య చర్చలకు పార్లమెంట్ సమీక్షించాలని, రైతులు, కార్మికుల హక్కులను కాపాడాలని ఎస్‌కేఎమ్ డిమాండ్ చేసింది. అందులో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు అంబేడ్కర్ చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్‌కేఎమ్ నాయకులు, కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పాన్‌గల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చని వైద్య సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డ్రై డేలో భాగంగా మంగళవారం మండలంలోని శాగాపూర్‌లో వైద్య సిబ్బంది పర్యటించి పారిశుద్ధ్య చర్యలు, సీజనల్ వ్యాధుల నివారణపై గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఏఎల్‌ఓ టీం సభ్యులు గంధం రాజు, లక్ష్మయ్య, సాయన్న, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, ఏఎన్ఎం సుమిత్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తగ్గించాలి

పాన్‌గల్: రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి సారించి రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఏడీఏ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేంద్రియ ఎరువుల వాడకం, పప్పు ధాన్యాలు, నూనెగింజల పంట సాగుపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 13న చివరి గడువు అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఓ డాకేశ్వర్‌గౌడు, ఉద్యానవన శాఖ అధికారి కృష్ణ, ఏఈఓలు అఖిల, షర్మిలాదేవి, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి టేబుళ్ల వితరణ



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయానికి (ఎమ్మార్సీ) పదవీవిరమణ పొందిన చింతకుంట పీఎస్ హెచ్ఎం ఐ.నారాయణ రూ.12 వేల విలువైన రెండు కంప్యూటర్ టేబుళ్లు, రెండు కుర్చీలు మంగళవారం అందజేసినట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. విద్యాశాఖ పట్ల తనకున్న అభిమానంతో రిటైర్డు అయినా తన వంతుగా సహకరించడం అభినందనీయమన్నారు. ఎంఈఓ, ఎమ్మార్సీ సిబ్బంది దాతను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాన్‌గల్ పీఎస్ ఉపాధ్యాయులు వెంకట్‌నారాయణ, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

'శిథిలమైన ఇళ్లలో ఉండొద్దు'

వనపర్తిటౌన్: నేడు, రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వర్షం కారణంగా ఏదైనా సమస్య తలెత్తితే మున్సిపల్ టోల్ ఫ్రీ నంబర్ 9177880893కు సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబడిన ఇళ్లలో ఎవరూ ఉండొద్దని, పాతబడిన ఇళ్లలో ఉన్నవారు వెంటనే ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలు, పునరావాస కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు భూ సేకరణ ప్రతిపాదనలకు రెవెన్యూ, సర్వే అధికారులు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పెగ్ మార్కింగ్, ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయిన వాటికి అవార్డ్ పాస్ చేయాలని సూచించారు. కానాయపల్లి నిర్వాసితుల పునరావాస కేంద్రం ఏర్పాటుపై సైతం చర్చించారు. సమీక్షలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎన్.కీమ్యానాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, జి–సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్ ఉన్నారు.

గణితం అర్థమయ్యే పద్ధతిలో బోధించాలి

విద్యార్థుల అందరి సామర్థ్యాలు ఒకే విధంగా ఉండవని, వారి స్థాయిని గుర్తించి వారికి గణితం అర్థమయ్యే విధంగా బోధించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఉపాధ్యాయులకు సూచించారు. ఐడీఓసీలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు గణితంలో పట్టు సాధించే దిశగా ఉపాధ్యాయులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించే వారికి ప్రత్యేకంగా తరగతులు పెట్టి అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. ప్రతి పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన కోసం ప్రతి ఒక్క విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర తినిపించాలన్నారు. డీఈఓ అబ్దుల్ ఘని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

ఆత్మకూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ ఆత్మకూర్‌లో సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి తనిఖీ చేశారు. ఇక్కడ నలుగురు డాక్టర్లు, ఏడుగురు స్టాఫ్‌నర్సులు ఒక హెడ్‌నర్సు ఉండికూడా నెలలో రెండు, మూడు ప్రసవాలే జరగడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. నెలలో కనీసం 30కి తగ్గకుండా ప్రసవాలు జరిగేవిధంగా సిబ్బంది, ఆశా తదితరులతో సమన్వయంతో ముందుకెళ్లాలని ఆదేశించారు. జిల్లాలో రైతులకు ఖరీఫ్ పంటలకు సరిపడ ఎరువు నిల్వలున్నాయని, ఆందోళన చెందవద్దని, అవసరానికి మించి కొనుగోళ్లు చేయొద్దని కలెక్టర్ సూచించారు. స్థానిక పీఏసీఎస్ గోదాంను, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా సందర్శించి ఎరువుల నిల్వలను పరిశీలించారు. బాలుర ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కంప్యూటర్ ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సీఐ శివకుమార్

అమరచింత: ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించుకోవాలని సీఐ శివకుమార్ కోరారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్ఐ హిమబిందు ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గణేష్ మండపాల నిర్వాహకులు, రాజకీయ నాయకులతో శాంతికమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ రాబోయే గణేష్ ఉత్సవాలను సమైక్యంగా జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వినాయక మండపాల నిర్వాహకులు డీజే సౌండ్ సిస్టంకు స్వస్తి పలికి దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడడంలో భాగస్వాములు కావాలన్నారు. విద్యుత్ కోసం ట్రాన్స్‌కో అధికారుల పర్మిషన్ తీసుకోవాలని, గణేష్ చందాల పేరుతో ప్రజలను వ్యాపారులను వేధింపులకు గురి చేయరాదన్నారు. మత సామరస్యంతో నిమజ్జన ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. సమావేశంలో ఆయా గ్రామాల గణేష్ మండపాల నిర్వాహకులు వీహెచ్‌పీ, మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'పుర' కార్మికుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



కార్మికురాలికి యూనిఫామ్ అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

వనపర్తిటౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. పారిశుద్ధ్య విధులు నిర్వహించే కార్మికులకు వారి ఆకాంక్షలకు అనుగుణంగా రెండు జతల యూనిఫామ్స్‌ను అందిస్తున్నామన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్స్ అందజేశారు. కార్మికులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్న జవాన్‌లు, అధికారులు, గుర్తించేందుకు వీలు కలగడంతో పాటుగా కార్మికులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 100 రోజుల ప్రణాళిక

జిల్లా కేంద్రంలోని పుర వీధులు 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం 03,17,06, 13,08,10,07,01,02,33,14వ, వార్డుల్లో 100 రోజుల ప్రణాళిక నిర్వహించారు. ఈ మేరకు ఆయా వార్డుల్లో తడి, పొడి వ్యర్థాల విభజన, డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డ్రెయినేజీలో డెస్టిల్ తొలగించే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్‌వైజర్, వార్డు ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు దేశం గర్వించేస్థాయికి ఎదగాలి



క్రీడాసామగ్రి అందిస్తున్న వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులు

ఆత్మకూర్: విద్యార్థులు చదువుతో పాటు కంప్యూటర్, క్రీడల్లో రాణించి, అత్యుత్తమ ఫలితాలు సాధించి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, ఎంఈఓ బాలరాజు తెలిపారు. మంగళవారం బాలుర ఉన్నతపాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షరజ్యోతి లైఫ్ లాంగ్ లెర్నింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్య, జీవిత నైపుణ్యాలు, విలువల ఆధారిత బోధన, తదితర విషయాలపై క్లుప్తంగా వివరించారు. విద్యార్థులు బాధ్యతగల పౌరులుగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుందని, అక్షర జ్యోతి కార్యక్రమం లక్ష్యంతో ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఫౌండేషన్ మేనేజరు బాలకృష్ణ, సమన్వయకర్త కావేరి, జీహెచ్ఎం కృష్ణయ్య, సంతోష్ కుమార్, ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

ఏచూరి ఆశయాల సాధనకు ఉద్యమించాలి



ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ జబ్బార్, బాల్‌రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏచూరి ఆశయాల కోసం ఉద్యమించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దోపిడీ లేని వ్యవస్థ రావాలని, కార్మిక వర్గ రాజ్యం కోసం తుది శ్వాస వరకు పోరాటం చేశారన్నారు. వారు ఆశించిన సమసమాజ మార్పు కోసం ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎం రాజు, నరమేశ్వరాచారి, మహేష్, రాఘవేంద్ర, నందిమల్ల రాములు, ఉమ పాల్గొన్నారు.

శివనాథ రంగనాథన్ సేవలు మరువలేనివి

వనపర్తిటౌన్: గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డా. శివనాథ రంగనాథన్ సేవలు మరువలేనివని లైబ్రేరియన్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో డా.రంగనాథన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠకులు హక్కు, సంవిధానం, సమాధానం సులభంగా పొందడం, శ్రమ సమర్థత, అంతర్జాల విశ్వసనీయత అనే 5 ప్రధాన నియమాలు ప్రతిపాదించిన రంగనాథన్ గ్రంథాలయ సాంకేతికతను గణాంకాలపరంగా అభివృద్ధి చేశారని గుర్తుచేశారు.

క్రీడాభివృద్ధికి పెద్దపీట

వనపర్తి: మునుపెన్నడూ లేని విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని వైద్య కళాశాల పక్కన 8.20 ఎకరాల్లో క్రీడా మైదానం, స్థానిక బాలుర జూనియర్ కళాశాల మైదానంలో స్విమ్మింగ్ పూల్, స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో హాకీ టర్ఫ్ మైదానం, శ్రీనివాసపురం శివారులో 35 ఎకరాల్లో క్రీడా పాఠశాల ఏర్పాటుకు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలతో కలిసి స్థల పరిశీలన చేశారు. వారి వెంట ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.